


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 207 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శనివారం 6 జూన్ 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE : 207 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 6 JUNE 2026 PRICE : 1/- RS
Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



# ఎండను లెక్కచేయకుండా..

## విశాఖ రోడ్లపై సీఎం చంద్రబాబు సైకిల్ సవారీ

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ తొక్కిన సీఎం చంద్రబాబు
- విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సాగిన ర్యాలీ
- 5.5 కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల్లో పూర్తి చేసిన ముఖ్యమంత్రి
- సీఎంతో పాటు పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు

పెన్ పవర్ డెస్క్:ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో సైకిల్ సవారీ చేశారు. నగరంలోని ఆంధ్ర యూనివర్సిటీ (ఏయూ) గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ హోటల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 5.5 కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో పూర్తి చేశారు. ఈ సైకిల్ యాత్ర ఏయూ గ్రౌండ్స్‌లో ప్రారంభమై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్ హోటల్ వద్ద ముగిసింది. ర్యాలీ సమయంలో ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ, చంద్రబాబు ఏమాత్రం అలసట లేకుండా సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని సైకిల్ తొక్కారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీని నిర్వహించారు.

## ఏపీలో చిన్న న్యూక్లియర్ రియాక్టర్లు...

### రష్యా దిగ్గజం రోసాటమ్‌కు లోకేష్ ప్రతిపాదన

- రష్యా పర్యటనలో ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ చర్చలు
- అణు విద్యుత్, డీశాలినేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు రోసాటమ్‌కు ప్రతిపాదనలు
- అల్యూమినియం ప్లాంట్లు, రిఫైనరీల ఏర్పాటుకు రుసాల్ సంస్థకు ఆహ్వానం
- ఆర్కిటిక్ సముద్ర మార్గం ద్వారా ఏపీకి వాణిజ్య అవకాశాలపై సదస్సులో ప్రసంగం
- లోకేష్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన రష్యా కంపెనీలు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనలో కీలక అడుగులు వేస్తున్నారు. తన పర్యటనలో నాలుగో రోజు, ఆయన సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రపంచ ప్రఖ్యాత అణుశక్తి దిగ్గజం రోసాటమ్ , అల్యూమినియం

- మిగతా 2లో

## ఆంధ్రా రొయ్య.. ప్రపంచస్థాయికి వెళ్లాలి: విశాఖ ఆక్వా సదస్సులో చంద్రబాబు



- బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు వెల్లడి
- అమరావతి నుంచి నెల్లూరు వరకు ఆక్వా కారిడార్ అభివృద్ధికి ప్రణాళిక
- భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో ఏపీ వాటా 38 శాతం అని వెల్లడి
- ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ
- 'ఆంధ్రా ప్రింప్.. ఇండియా సీ-ఫుడ్' అనే బ్రాండ్ స్థాపించాలని పిలుపు

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదేనని, భారతదేశ బ్లూ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆక్వా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆక్వా రంగ అభివృద్ధికి తన



## డీఎస్సీపై ప్రభుత్వం ఫుల్ క్లారిటీ..

### హారిజాంటల్ రిజర్వేషన్‌పై సుదీర్ఘ వివరణ

- డీఎస్సీ నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్ పై ప్రభుత్వ సమగ్ర వివరణ
- జీవో 77 ప్రకారమే పోస్టుల భర్తీ, సుప్రీంకోర్టు ఆదేశాల అమలు అని వెల్లడి
- వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ల మధ్య తేడాను ఉదాహరణలతో స్పష్టం చేసిన అధికారులు
- స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా ఎంపికలు నిబంధనల ప్రకారమే జరిగాయని వెల్లడి
- కాల్ లెటర్ వస్తే ఉద్యోగం వచ్చినట్లు కాదు, అది కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసమేనని స్పష్టీకరణ

2లో



## జనసేన పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్...

- జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్
- అధికారికంగా ఖరారు చేసిన పవన్ కల్యాణ్
- శనివారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేయనున్న రమేష్
- కష్టకాలంలో నిలిచినందుకే పదవి అన్న జనసేన
- 2015 నుంచి పవన్ వెన్నంటి ఉన్న లింగమనేని రమేష్

- మిగతా 2లో



## కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాలు..

### ఐఎండీ హెచ్చరిక

- కేరళలో తీవ్రరూపం దాల్చిన నైరుతి రుతుపవనాలు
- ఐదు ఉత్తర జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ
- శనివారం అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక
- పలుచోట్ల ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు
- కొండ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

- మిగతా 2లో

## భారత్‌తో కలిసి ఎస్‌యూ-57 ఫైటర్ జెట్ రూపొందించడానికి సిద్ధం



- ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను సంయుక్తంగా అభివృద్ధి చేద్దామన్న పుతిన్
- టెక్నాలజీ బదిలీపై ఎలాంటి ఆంక్షలు ఉండవని స్పష్టం
- స్వదేశీ AMCA ప్రాజెక్టు ఆలస్యం నేపథ్యంలో రష్యా ప్రతిపాదన
- గతంలో అధిక వ్యయంతో నిలిచిపోయిన ఫైటర్ జెట్ ఒప్పందానికి మళ్లీ తెర
- ప్రస్తుతానికి ఇదే అత్యుత్తమ యుద్ధ విమానమని పుతిన్ వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:భారత్‌తో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక ప్రతిపాదన చేశారు. ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ అయిన 'సుఖోయ్-57'ను భారత్‌తో కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు, ఉత్పత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ యుద్ధ విమానానికి

- మిగతా 2లో

## మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు



- కర్ణాటకలో కొత్త ప్రభుత్వంలో మొదలైన విభేదాలు
- మంత్రి పదవికి రాజీనామా చేసిన సీనియర్ నేత రామలింగారెడ్డి
- బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి
- ఇది అధిష్ఠానం నిర్ణయమని స్పష్టం చేసిన సీఎం డీకే శివకుమార్
- రామలింగారెడ్డితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడి

- మిగతా 2లో



## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ

- యుద్ధాన్ని ముగించేందుకు నేరుగా చర్చలు జరపాలని ప్రతిపాదన
- లేఖను పుతిన్ చదివారని వెల్లడించిన క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్
- చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని రష్యా ప్రకటన
- స్విట్జర్లాండ్, టర్కీ వంటి దేశాల్లో భేటీకి జెలెన్‌స్కీ సూచన

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అనూహ్య పరి ణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వాలోదిమిర్ జెలెన్‌స్కీ

- మిగతా 2లో



## తమిళనాడులో బీజేపీకి దెబ్బ మీద దెబ్బ..

### అన్నామలై కోసం వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ రాజీనామా

పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో భారతీయ జనతా పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు అన్నామలై రాజీనామా తర్వాత.. అదే బాటలో సీనియర్ లీడర్లు పార్టీని వీడుతున్నారు.

- మిగతా 2లో

## కామారెడ్డి జిల్లాలో విషాదం.. నదిలో దిగి ముగ్గురి మృతి

- కామారెడ్డి జిల్లా మంజీరా నదిలో ఘోర ప్రమాదం
- స్నానానికి దిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- మృతులు అనిత (40), పావని (14), శివాని (13)గా గుర్తింపు
- ప్రమాదం నుంచి ఒకరిని సురక్షితంగా కాపాడిన స్థానికులు
- ఎల్లమ్మ గుడికి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లగా ఘటన

పెన్ పవర్ డెస్క్:కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచే సుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగి ఒకే కుటుంబానికి

- మిగతా 2లో



పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు పంపిణీ





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 05:**"వృక్షో రక్షతి రక్షితః -- పచ్చదనాన్ని పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం!" పర్యావరణ పరిరక్షణ పిలుపు!" ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ తాడేపల్లిగూడెం శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పంపిణీ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ వైస్ చైర్మన్ ఎగ్గిన నాగబాబుమాట్లాడుతూ ఇప్పుడు ఉన్న పరిస్థితి లలో ప్లాస్టిక్, కలుషితమవుతున్నాయని డాన్8వల్ల వాతావరణం మార్పులు అని దయచేసి అందరూ మొక్కలు నాటి సమాజంలో పచ్చదనాన్ని పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం శాఖ సభ్యులు, మహిళలు ప్రజాలు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన పర్యావరణం ప్రతి మనిషి హక్కు

**హెచ్ఆర్పీఏసీఐ ఆధ్వర్యంలో పర్యావరణ రక్షణపై అవగాహన**



**రాజమహేంద్ర వరం, పెన్ పవర్, జూన్ 5:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ,అవేర్నెస్ కౌన్సిల్ అఫ్ ఇండియా" ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు.
"పరిశుభ్రమైన పర్యావరణం ప్రతి మనిషి హక్కు" అనే సందేశంతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు సత్య గుమ్మాపు సభ్యులు మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం పై అవగాహన కల్పించారు. పర్యావరణ కాలుష్యం వల్ల మానవ ఆరోగ్యం, జీవ వైవిధ్యం, భవిష్యత్ తరాలపై పడే ప్రభావాలను వివరించి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తగరం సురేష్ బాబు ఉచితంగా మొక్కలు అందచేసారు. సంస్థ ఆధ్వర్యంలో సత్య గుమ్మపు, డాక్టార్ కే ఎం జగదీష్ మొక్కని అందచేసి
స్థానిక బాబా నగర్ లో మొక్క ను నాటి సంరక్షణ చూడాలని ప్రతిజ్ఞ చేయంచారు. ఈ కార్యక్రమంలో బిందు చౌదరి, కొమ్మిరెడ్డి ప్రభావతి, పిచ్చుక మహేష్, పగడాల కిషోర్, గొల్లవెల్లి శ్రీనివాస్, గుంటూరు రమణ, జొన్నకూటి వర్ధన్ కుమార్, ఎరువ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి కూలీ ఊపిరి తీసిన ట్రాక్టర్



**సీతానగరం, పెన్ పవర్, జూన్:05:**ఉదయాన్నే ఉపాధి పనికి వెళ్లిన కూలీ పైకి ట్రాక్టర్ మృత్యువులా దూసుకొచ్చింది. ఈ ఘటన సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం టీపి స్కీం వద్ద ఉపాధి పనులు ముగించుకుని మస్టర్లు వేసేందుకు తిరిగి సైకిల్ పై వస్తున్న నేపథ్యంలో పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన మన్యం అప్పారావు వయస్సు (70) అనే కూలీని శుక్రవారం ఉదయం తాడిచెట్టు కోసే ట్రాక్టర్ ఢీ కొట్టగా మృతి చెందారు . వెనుక చక్రం కింద పడిపోయిన అప్పారావు తల నుజ్జు నుజ్జు అయింది. భార్య గతంలోనే మృతి చెందడంతో అప్పారావు మనవళ్లు వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నారు. సీతానగరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎన్నికల మ్యాపింగ్ గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్ కె. దినేష్ కుమార్






**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** రాబోయే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పోలవరం జిల్లాలో జరుగుతున్న ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా 100% పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపహాలంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తో కలిసి ఆయన అన్ని మండలాల ఈఆర్ఓలు, తహసీల్దార్లు, బీఎల్ఓలు, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో ఎన్నికల మ్యాపింగ్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గం, మండలాల వారీగా మ్యాపింగ్ను ఈఆర్ఓలు, తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యవేక్షించాలని, డేటాను ఆన్లైన్లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాలతో సరిగ్గా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. గ్రామ సచివాలయ సిబ్బంది బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు.
నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో మ్యాపింగ్ పూర్తి కావాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతోపాటు, మ్యాపింగ్ ద్వారా ఓటర్లకు ఓటింగ్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు సిహెచ్. బాలాజీ, కరక సత్యనారాయణ, సిహెచ్. శ్రీనివాసరావు, వేణుగోపాల్, అమ్మాజీ, దొరకయ్య, ఇవి సత్యనారాయణ, స్వామి, అన్ని మండలాల డిప్యూటీ తహసీల్దార్లు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రూరల్ మండలంలో పర్యావరణ దినోత్సవ వేడుకలు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రూరల్ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కల నాటడం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పి 4 లో తాను నాలుగు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీరాజ్ శాఖ సిబ్బందితో శాఖల వారీగా, పనుల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామాలలోని స్వర్ణ సచివాలయాలను రోల్ మోడల్ సచివాలయాలుగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.
పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికుల పనితీరు, గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ మండల ఎంపీడీఓ శ్రీ కె. సునీల్ ఆర్మ్స్ట్రాంగ్, డిప్యూటీ ఎంపీడీఓ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్సీ అవకతవకలపై ప్రశ్నిస్తే కేసులా ?



**నామినేషన్ వర్కులపై విచారణ జరపాలి**

**మీడియా సమావేశంలో మాజీ ఎంపీ భరత్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 5 :** డిఎస్సీ అవకతవకలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టమని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటన చేయటం దారుణమని మాజీ ఎంపీ వై.ఎస్.ఆర్.సి.పి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ విమర్శించారు. స్థానిక మార్గాని ఎస్టేట్స్ లోని వై.ఎస్.ఆర్.సి.పి సిటీ కార్యాలయంలో మాజీ ఎంపీ భరత్ శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డి ఎస్ సి లో ఫస్ట్ ర్యాంక్ వచ్చిన వ్యక్తికి ఎందుకు జాబ్ ఇవ్వలేదని అడిగినదానికి ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యమా లేక ఉత్తర కొరియా పరిపాలన లా నియంత అకుంటున్నారా అని భరత్ ప్రశ్నించారు. అసలు డిఎస్సి లో స్పోర్ట్స్ కోట పేరిట ఎలా ఉద్యోగాలు ఇస్తారని భరత్ ప్రశ్నించారు. అన్ని వేళ్ళు విద్యాశాఖా మంత్రి వైపే చూపిస్తున్న తరుణంలో ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరగాలన్నారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిపోతుందన్నారు. దారుణమైన విధానాలు అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలకడం ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.
గోదావరి పుష్కరాలను కుంభమేళ తరహాలో 45 రోజులు నిర్వహిస్తామని రెండేళ్లలో ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా లో చేపట్టార అని ఆయన ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ పర్యటనలో పేపర్ మిల్లుపై తీవ్ర ఆరోపణలు చేశారని, మిల్లు కాలుష్యంపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజమండ్రి మీద ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. మూడుసార్లు టిడిపికి చెందిన మేయర్లే నగరాన్ని పాలించారని, ఒక్కరు కూడా ప్లాంట్ నిర్మించ లేకపోయారన్నారు. కార్పొరేషన్ లో దారుణమైన అవినీతి జరుగుతుందని, ఈవీఎం ఎమ్మెల్యే అనుచరులకు , బంధువులకు నామినేషన్ మీద వర్కులు ఇచ్చేస్తున్నారని మాజీ ఎంపీ భరత్ ఆరోపించారు. నామినేషన్ వర్కులు ఎందుకు ఇస్తున్నారో మున్సిపల్ కమిషనర్ సమాధానం చెప్పాలనీ , దీనిపై సమగ్ర విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేసారు. సి-బిల్స్ పెట్టి కాంట్రాక్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ నుండి డబ్బులు తీసేసుకుంటు న్నారని, అనధికార కట్టడాలు టౌన్ లో పెరిగిపోతున్నాయని విమర్శించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్బంగా మాజీ ఎంపీ భరత్ మొక్కలు నాటారు. బిసి సంఘాల జెఏసి రాష్ట్ర నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపర్చాలి








- **రోగులకు వెంటనే పరీక్షలు, ఉచిత మందులు అందించాలి**
- **జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5 :**పోలవరం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉచిత మందులను అందజేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్తో కలిసి రంపచోడవరంలోని ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులు, ఓపీ విభాగం, అత్యవసర సేవల విభాగం, ప్రసూతి వార్డు, మందుల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే వైద్యం పొందుతున్న రోగులను నేరుగా కలిసి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎలాంటి ఆలస్యం లేకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరాన్ని బట్టి ఆసుపత్రిలో చేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల మందులను రోగులకు ఉచితంగా అందించడంతో పాటు అవసరమైన ఔషధ నిల్వలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు తాగునీరు సహా కనీస సౌకర్యాలు కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న ఇన్పేషెంట్ల సంఖ్య, ప్రతిరోజూ వచ్చే అవుట్పేషెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు రెండు పూటలా నాణ్యమైన భోజన సదుపాయం కల్పించాలని, ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.వైద్యాధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యప్రకాశరావు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి సాంబశివరావు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గత వైకాపా ప్రభుత్వం డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చినా..



✷ అమలు చేయడంలో విఫలమైంది.

**పెన్ పవర్, జూన్ 05:**పంచాయితీల్లో స్కానర్లు ఏర్పాటు చేసినా క్షేత్ర స్ధాయిలో అవగాహన కల్పించకపోవడంతో మొత్తం విధానమే అటకెక్కింది.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నూతన కార్యాచరణకు శ్రీకారం చుట్టి స్వర్ణపంచాయితీ వ్యవస్దను ప్రవేశపెట్టింది. సచివాలయాల్లో ఆర్దిక లావాదేవీలన్నీ పారదర్శకంగా సాగేలా 2025-26 నుంచి డిజిటల్ సేవల్ని విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.ఏలూరు మండలంలో కొన్ని సచివాలయాల సిబ్బంది ప్రజలకు డిజిటల్ విధానంపై అవగాహన కల్పించక పోవడంతో, నగదురూపంలో ఇంటి పన్నులను నగదు రూపంలో సచివాలయం చెల్లిస్తున్నారు. నిభంధనల ప్రకారం నగదు లావాదేవీలు చేయకూడదు.ఒక వేళ చేస్తే పంచాయితీ అక్కౌంట్‌కు జమచేసి పిడిఎఫ్ రసీదులు వెంటనే పన్ను చెల్లించిన ఇంటి యజమానికి అందజేయాలి.కొన్ని సచివాలయాల సిబ్బంది ఇంటి పన్నులు ఖాతాకు జమచేయకుండా పక్కదారి పట్టిపట్టిస్తున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి.మండల స్దాయి ప్రత్యేక అధికారులు,పర్యవేక్షణ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇంటి పన్నులు పక్కదారి పట్టిస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు.ఇంటి పన్నులకు సంభందించి స్వర్ణపంచాయితీ యాప్‌కు కొన్ని అసెస్‌మెంట్లు అనుసంధానం చేయకపోవడం,శ్రీపర్రు సచివాలయంలో 2021-నుండి ఇంటి పన్నుల ఎరియర్స్ వసూలు చేసిన నగదును స్వర్ణపంచాయితీకి జమ చేయకపోవడం,బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌కు నగదు డిమాండ్ చేయడం,వాటర్ ప్లాంట్స్,పెట్రోల్ బంకులు,సెల్ టవర్ అనుమతులకు,సెల్ టవర్ నిర్వాహకుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెలువడుతున్నా పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకోకుండా,తూతూ మంత్రంగా సచివాలయాల పర్యటనలు సాగిస్తున్నారని ప్రజలు విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

ఫోటోలున్నాయి: 5 ఇఎల్ఆర్ 2.శ్రీపర్రు సచివాలయంలో ఇంటి పన్నులు పక్కదారి పట్టిస్తున్నారు..!!ఏలూరు జూన్ 5 పెన్‌పవర్ :ఏలూరు మండలం శ్రీపర్రు సచివాలయం పరిధిలో గ్రామ ప్రజలు సచివాలయంసిబ్బందికి నగదు రూపంలో ఇంటి పన్నులు చెల్లించిన వారికి ఆన్‌లైన్‌లో జమచేసి పిడిఎఫ్ రీసీదులు ఇవ్వకుండా తమ జేబులో వేసుకుంటున్నారని,గ్రామానికి చెందిన బి.రామజోజమ్మ గురువారం సచివాలయం మెట్టపై కూర్చుని విలపించారు.జోజమ్మ తన ఇంటి పన్నుకుసంభందించి పాంచాయితీ గుమస్తా జోజికి రూ.1700 ఇచ్చిరెండు నెలలు కావస్తోందని,సచివాలయం కార్యదర్శికి గత నెల30వ తేదీన రూ.3000 వేలు ఇచ్చానని,వాటికిరసీదులు ఇవ్వకుండా సచివాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారుల పాలన వచ్చినప్పటికీ సిబ్బందిలో మార్పురాలేదని,దీనికి పర్యవేక్షణ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణంగా కనిపిస్తోందని ప్రజలనుండి ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి.నగదు రూపంలో ఇంటి పన్నులు చెల్లించిన వారికి వెంటనే రసీదులు ఇప్పించి పన్నులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని,తమ పనులకు రసీదులు ఇవ్వకుండా పదోన్నతిపై వెళ్లిపోతే తమ పరిస్దితి ఎమిటని మండల పర్యవేక్షణ అధికారులను గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు

కార్యదర్శి,గుమస్తా,వివరణ :ఈ విషయమై సచివాలయం కార్యదర్శి ఆనంద్‌ను,పంచాయితీ గుమస్తా జోజి వివరణ కోరగా రామజోజమ్మ గత నెల 28న నగదు ఇచ్చినమాట వాస్తమేనని,కానీ సర్వర్ పనిచేయని కారణంగా ఆమెకు రసీదులు ఇవ్వలేదన్నారు. గుమస్తాను వివరణ కోరగా ఆమె రెండు నెలల క్రితండబ్బులు ఇచ్చారన్నారు.మరి పంచాయితీ అకౌంట్‌కు ఎందుకు జమచేయలేదని అడుగగా నీళ్లు నమిలాడు.

## పోషణవాటికలు అధ్వనం..కలుషిత తాగునీరు





✷ సూపర్‌వైజర్‌ల పర్యవేక్షణ కరువు

**ఏలూరు జూన్ 5 పెన్‌పవర్ :** మాతాశిశు సంరక్షణ విభాగం పరిదిలోని భీమడోలు ప్రాజెక్టు,భీమడోలు సెక్టార్ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్దంగా మారింది.సెక్టార్ల సూపర్ వైజర్ల పర్యవేక్షణలేమి కారణంగా పలు కేంద్రాల్లో వాటికల నిర్వహణ,శుద్దమైన తాగునీరు చిన్నారులకు అందించడం లేదు.కేంద్రాలకు మంజూరు చేసిన వాటర్ ప్యూఫైయర్లలో సగానికి పైగా పనిచేయడం లేదు.దీంతో కుళాయి వాటర్ చిన్నారులు తాగి అనారోగ్యానికి గురవుతున్నారు.సూరప్పగూడెం అంగన్ వాడీ సెంటర్ 17 కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది.చిన్నారులు,గర్భిణులు.బాలింతల్లో రక్తహీనత లేకుండా,వారికి పోషకాహారం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.పోషణ వాటిక పేరిట స్దలాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రీమ పద్దతిలో కూరగాయలు పండించి,నాణ్యమైన ఆహారం అందించాలని యోచించింది.దీనికి ఒక్కో కేంద్రానికి రూ.10వేలు నిధులు మంజూరు చేసింది.జిల్లాలో సొంత భవనాలు ఉన్న అంగన్ వాడీ కేంద్రాల్లో పోషణ్ వాటికలు ఏర్పాటు చేశారు.వీటి నిర్వహణ అస్తవ్యస్దంగా ఉంది.చాలా చోట్ల కూరగాయల మొక్కలు లేకుండా పిచ్చిమొక్కలు,పోషణ్ వాటికల చుట్టూ రక్షణ కంచెలు మొక్కుబడిగా ఏర్పాటు చేశారు.వాటికలకు రక్షణ కంచె లేక పోవడంతో పశువులు వాటికల్లో పడి కూరగాయల మొక్కలను మేసేస్తున్నాయి.దీంతో మండలంలోని పోషణ్ వాటికల్లో సేంద్రాయ కూరగాయలు పండించి నాణ్యమైన ఆహారం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరు కారుతోంది.చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి స్పందించి కేంద్రాల నిర్వహణను మెరుగు పరచాలని గర్భిణులు,బాలింతలు,చిన్నారుల తల్లి తండ్రులు కోరుతున్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన బాదంపూడి గ్రామపంచాయతీ




**పెన్ పవర్, ఉంగుటూరు: జూన్ 5** ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామపంచాయతీ పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కె.వి. గిరిధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు.

కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించి పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే మొక్కల పంపిణీ, మొక్కల నాటకం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అధికారులు సూచించారు.

గ్రామసభ సందర్భంగా దానం నగర్ కాలనీ వాసులు కోళ్ల ఫారం, డ్రైనేజీ సమస్యలు, ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి గెడ్డం రమేష్‌బాబు, కూటమి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, అంగన్‌వాడీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 17 అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధుల విడుదల



✷ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యం
✷ కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** జిల్లాలో గ్రామీణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు రూ.50 లక్షల వ్యయంతో 17 తాగునీటి అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా నిధులు విడుదల చేసినట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలోని పలు మండలాల్లో తాగునీటి వసతుల విస్తరణ, బోర్‌వెల్లు, నిల్వ ట్యాంకులు, పైప్‌లైన్లు, ప్రజా కుళాయిల ఏర్పాటు, ఆర్వో ప్లాంట్ల నిర్మాణం, హ్యాండ్‌పంపుల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గంగవరం, మారేడుమిల్లి, రంపచోడవరం, దేవీపట్నం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వి.ఆర్.పురం, చింతూరు, కూనవరం మండలాల్లో ఈ అభివృద్ధి పనులు అమలు కానున్నాయని వెల్లడించారు.వి.ఆర్.పురం మండలంలో తాగునీటి సౌకర్యాల కోసం రూ.10 లక్షలు, చింతూరు మండలంలో రూ.10.20 లక్షలు, రంపచోడవరం, దేవీపట్నం మండలాల్లో చెరో రూ.5 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను తగ్గించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత ప్రజలకు మెరుగైన తాగునీటి సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అడ్డతీగల తహసిల్దార్ గా కె. తేజస్విని..



**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 05:** అడ్డతీగల తాసిల్దార్ గా కె. తేజస్విని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు గంగవరం మండల డిప్యూటీ తాసిల్దార్ గా బాధ్యతలు నిర్వహిస్తూ, పదోన్నతి పై అడ్డతీగల తాసిల్దార్ గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన డిప్యూటీ తాసిల్దార్ దొరకయ్య నూతన తాసిల్దార్ తేజస్వినికి శుక్రవారం బాధ్యతలు అప్పగించారు. దొరకయ్య యధావిధిగా డిప్యూటీ తాసిల్దార్ బాధ్యతను నిర్వహిస్తున్నారు. తాసిల్దార్ తేజస్విని మాట్లాడుతూ గతంలో డిప్యూటీ తాసిల్దార్ గా అడ్డతీగల మండలంలో బాధ్యతలు నిర్వహించిన అనుభవం తనకున్నదని, తాసిల్దార్ ఆఫీసుకు ప్రజలు వచ్చినప్పుడు తనను నేరుగా సంప్రదించవచ్చని వారికి ఉన్నటువంటి ఇబ్బందులను తనకు నేరుగా తెలియజేయవచ్చని తేజస్విని తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ కే. తేజస్వినికి సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

# దప్పిక తీర్చే నాధులేరీ!

✷ నీరందక విలవిల



**ఏలూరుజూన్ 5 పెన్ పవర్ :** ఎండలు మండుతున్నాయి.ఉదయం పది దాటితే భానుడి భగభగలతో జనం విలవిల్లాడుతున్నారు.ఇక మూగజీవాల సరిస్దితి మరీ దయనీయం.నేపథ్యంలో గతేడాది కూటమి ప్రభుత్వం ప్రతి మండలంలో దాదాపు 20 వరకు నీటి తొట్టేలను నిర్మింపజేసింది.ఒక్కో తొట్టే నిర్మాణానికి రూ.32 వేలు వంతున నిధులు వెచ్చించారు.ద్వారకాతిరుమల మండలంలొ 15కు పైగా నీటి తోట్టేలను ఏర్పాటు చేశారు.వాటిలో నీటినినింపి నిర్వహించే బాద్యతను ఉపాధి,పంచాయితీల సిబ్బంద నిర్వహించాల్సి ఉంది.నిర్మాణం చేపట్టిన తొలినాళ్లలో కొంత మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించి మూగజీవాల దప్పిక తీర్చారు.మండలం రాళ్లకుంట గ్రామంలో గత కొంత కాలంగా నీటితొట్టేలను నీటితో నింపక పోవడంతో పశువులు విలవిల్లాడుతున్నాయని రైతులు వాపోతున్నారు.ర్ళ్లకుంటతో పాటు రాజుల కుంట, రామన్నగూడెం,వేంపాడు, వెంకటకృష్ణాపురం,మారంపల్లి, గుండుగోలను కుంట,తదితర చోట్ల నింపడంలేదు.గేదేలు,మేకల పోషకులు నీటిని సమకూర్చేందుకు నానా భాధలు పడుతున్నారు.కొందరైతే కిలోమీటర్ల దూరంలో ఉండే బోర్ల వద్దకు తోలుకెళ్లి దాహార్తి తీరుస్తున్నారు తోట్టేలలో నీరునింపేలా చర్యలు తీసుకుఓవాలని వారు కోరుతున్నారు.

## మళ్లీ రోడ్డు ఎక్కుతున్న ఉద్యమకారులు..




**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 05**: అడ్డతీగల ఏలేశ్వరం మధ్య రోడ్డు గోతులు పడి పాడయ్యి, దశాబ్ద కాలం దాటింది అయితే గత ఆరు నెలల క్రితం కూటమి ప్రభుత్వం రోడ్డు పనులు ప్రారంభిస్తామని, భారీ ఉద్యమాల అనంతరం హామీ ఇచ్చారు. అయితే రోడ్డు పనులు మూడు కిలోమీటర్లు సాగిన అనంతరం మరల నిలిచిపోయాయి. అయితే దీనికి కారణం కాంట్రాక్టర్కు బిల్లును ఇవ్వనందున రోడ్డు పనులు నిలిచిపోయాయి అని సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిలిచిపోయిన రోడ్డు మధ్యలో రోడ్డు వెంటనే నిర్మించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏలేశ్వరం అడ్డతీగల మధ్య రోడ్డుపై దృష్టి పెట్టి రోడ్డు పనులు పూర్తి చేయాలని సిపిఐ ఎంఎల్ నాయకులు గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సోముల . కుశల, నాగులంపల్లి .అర్జున్, నాని శెట్టి .లోవరాజు, వల్లి. కొండలరావు, బాబురావు, పడాల. తాతారావు మరియు సి పి ఐ ఎం ఎల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దోమ పుట్టరాదు.. దోమ కుట్టరాదు
## ఆత్రేయపురంలో అవగాహన కార్యక్రమం



**పెన్ పవర్ ఆత్రేయపురం, జూన్ 5 :**దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య అధికారులు సూచించారు. ఆత్రేయపురం పీహెచ్‌సీ పరిధిలోని ఆత్రేయపురం-1 గ్రామంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా "దోమ పుట్టరాదు.. దోమ కుట్టరాదు" అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు దోమల నివారణ చర్యలపై వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, నీటి నిల్వ పాత్రలను శుభ్రంగా ఉంచడం, దోమతెరలు వినియోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముసురుమిల్లి, సూరంపాలెం జలాశయాల మరమ్మత్తులకు రూ.65 లక్షలకు పైగా నిధులు

- సాగునీటి ప్రాజెక్టుల సమర్థత పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి





**దేవీపట్నం/గంగవరం, పెన్ పవర్, జూన్ 5:** సాగునీటి ప్రాజెక్టుల సమర్థత పెంపు, రైతులకు నిరంతర సాగునీటి సరఫరా లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. శుక్రవారం ముసురుమిల్లి, సూరంపాలెం జలాశయాల మరమ్మత్తు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్టుల భద్రత, నిర్వహణ, పరికరాల సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు కాలానుగుణంగా సాగునీరు అందించేందుకు ప్రాజెక్టుల మరమ్మత్తులు, ఆధునికీకరణ పనులు అవసరమని పేర్కొన్నారు. పాత ప్రాజెక్టుల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, వాటిని సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. సూరంపాలెం ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం రూ. 29.46 లక్షలు, ముసురుమిల్లి ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం రూ. 36 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులను పూర్తి పారదర్శకంగా వినియోగించి, నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం చేపడుతున్న మరమ్మత్తు పనులు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించేలా ఉండాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు. రైతులకు అందాల్సిన సేవలు సకాలంలో, సమర్థవంతంగా అందేలా ప్రాజెక్టు యాజమాన్యం బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ దేవీపట్నం, గంగవరం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు, పల్లాల వెంకటరెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు రాయుడు, కుంజం సిద్దు, తెదేపా క్లస్టర్ ఇన్‌చార్జి ముచ్చు వీర వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు కీర్తి గంగరాజు, కనిగిరి సుభాష్, దేవీపట్నం సొసైటీ అధ్యక్షుడు మాగాపు బాబురావు, మాజీ పార్టీ అధ్యక్షులు మరిశేట్ల వెంకటేశ్వరరావు, ముంద్రు మధుసూదన్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జొన్నల రాంబాబు (నాని), నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రేలంగి రాంబాబు, డైరెక్టర్లు పల్లపాటి నాగేశ్వరరావు, మడకం శ్రీనివాస్, సాగునీటి శాఖ అధికారులు కేవీఎస్ రామ్ ప్రసాద్, జి. వంశీధర్, ఎం. గంగాధర రామారావు, రత్న జైకర్, పెద్దిరాజు, విశ్వేశ్వరరావు, శంకర్ నాయక్, పద్మజ, టి. నలినికుమారి ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, సాగునీటి శాఖ అధికారులు, ప్రాజెక్టు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రంపచోడవరం తహసీల్దార్‌గా సీహెచ్ బాలాజీ బాధ్యతల స్వీకరణ-సిబ్బంది ఘన సన్మానం



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** రంపచోడవరం తహసీల్దార్‌గా పదోన్నతి పొందిన సీహెచ్ బాలాజీ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఆయనను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ సీహెచ్ బాలాజీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. భూ వివాదాలు, రీ-సర్వే సమస్యలు, వివిధ ధ్రువపత్రాల జారీకి సంబంధించిన అంశాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన దరఖాస్తుదారులకు సత్వరంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు సంబంధించిన సమస్యలను కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన తాను, ప్రభుత్వం పదోన్నతిపై పూర్తి స్థాయి తహసీల్దార్‌గా నియమించడం పట్ల జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు పాయాజ్ భాష (జిలానీ), సునీత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ నిర్మల, మండల సర్వేయర్ ఎం. లక్ష్మణ్, వెంకటేశ్వరరావు, మాధురి, పృథ్వి, వీఆర్వోలు చిన్నరాజు, జమున, ఆనంద్, ప్రభావతి, శివకుమార్, సుంకరి గణపతి, కె. మణి, లక్ష్మి, గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్-50 విద్యార్థులు జూన్ 12న కేటాయించిన పాఠశాలల్లో చేరాలి

### గిరిజన సంక్షేమ ఉప సంచాలకుడు రుక్మండయ్య సూచన




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా నిర్వహిస్తున్న సూపర్-50 కార్యక్రమం గత విద్యా సంవత్సరంలో విశేష ఫలితాలను సాధించిందని గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు రుక్మండయ్య తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో సూపర్-50 ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించగా, పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 18న నిర్వహించిన సూపర్-50 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు జూన్ 12న కేటాయించిన పాఠశాలల్లో చేరాలని సూచించారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో బాలురను ముసురుమిల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో, బాలికలను కె. ఎర్రంపాలెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో చేర్చనున్నట్లు తెలిపారు. అదేవిధంగా చింతూరు ఐటీడీఏ పరిధిలో బాలికలను బొడ్డుగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో, బాలురను నర్సింగపురం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చేర్చనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల బదిలీ ధ్రువపత్రాలతో (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు) వారిని ఆయా పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. సూపర్-50 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల జాబితాను ఇప్పటికే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించినట్లు గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు రుక్మండయ్య తెలిపారు.






# పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలి







- ప్రతి ఇంటా ఒక మొక్క నాటాలి: కలెక్టర్ దినేష్ కుమార్
- ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే శిరీషాదేవి, జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రంపచోడవరం మండలం ముసురుమిల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఇంటిలో కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, కాలుష్యం, నీటి వనరుల క్షీణత వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, పర్యావరణహిత ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని 'జలదార--జలహారతి' కార్యక్రమం ద్వారా చెరువులు, కుంటలు, జల వనరుల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కింద విస్తృత స్థాయిలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని సంరక్షించుకోవచ్చని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో చెట్ల నరికివేతను నిరోధించి ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామం, ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వ భూములు, రహదారి గట్లు, ఖాళీ స్థలాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు బోర్నగూడెం గ్రామస్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు సంప్రదాయ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ఎం. రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు షేక్ అహ్మద్ షరీఫ్, తహసీల్దార్ సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, వైస్ ఎంపీపీ కే. బాలకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, ఎంపీటీసీ కుంజం వంశీ, ఏటీఓ బి. చిన్నిబాబు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## వరదల సన్నద్ధతపై నేడు జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

### చింతూరులో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** రానున్న వరదల నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత, నివారణ చర్యలు, సహాయక కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జూన్ 6న చింతూరు ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సమన్వయ శాఖల అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించిన వరదల సన్నద్ధత చర్యలు, అందుబాటులో ఉన్న వనరులు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికతో సమావేశానికి రావాలని సూచించారు. వరదల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై గ్రామస్థులకు అవగాహన



**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, జూన్ 5:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మారేడుమిల్లి మండలం అకుమామిడికోట గ్రామంలో శుక్రవారం విస్తృతంగా మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు.

ఫారెస్ట్ సెక్షన్ అధికారులు కె. కిశోర్‌బాబు, సీహెచ్. నరేష్‌బాబు ఆధ్వర్యంలో అటవీ బీట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్. ఆదిత్యరాజ్, వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్) ఛైర్మన్ పి. అబ్బాయిరెడ్డి, ఉపాధ్యక్షురాలు కె. సోమాలమ్మ, గ్రామస్థులు కలిసి 25 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవులు, ప్రకృతి వనరుల సంరక్షణతో పాటు వన్యప్రాణులకు హాని కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు

# చిన్నారుల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు 'నవచేతన్' యాప్

- గంగవరంలో అంగన్‌వాడీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- పోలవరం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె. ఉమా




**గంగవరం, పెన్ పవర్, జూన్ 5:** ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించేందుకు 'నవచేతన్' యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పోలవరం జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె. ఉమా తెలిపారు. ఈ యాప్ ద్వారా చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను క్రమం తప్పకుండా పరిశీలించి అవసరమైన సమయంలో వైద్య సేవలు అందించడం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.శుక్రవారం గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో 'ఎనేబుల్డ్ ఎర్లీ చైల్డ్ డెవలప్‌మెంట్ స్క్రీనింగ్' అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గంగవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి. సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె. ఉమా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవచేతన్ యాప్ ద్వారా 0–6 సంవత్సరాల పిల్లలకు ఆరోగ్య పరంగా సమగ్ర స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పనిచేస్తూ పిల్లల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. స్క్రీనింగ్ ప్రక్రియ ద్వారా పోషకాహార లోపం, ఎదుగుదలలో సమస్యలు, ఇతర ఆరోగ్య సంబంధిత ఇబ్బందులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించవచ్చని వివరించారు.పిల్లల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, ఈ యాప్ వినియోగంతో సేవలు మరింత సమర్థవంతంగా అందించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో వై. లక్ష్మణరావు, సూపర్వైజర్లు కె. కుమారి, సీహెచ్. చిన్నసీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'మన డబ్బు--మన లెక్కలు' యాప్‌తో ఆర్థిక లావాదేవీలకు పారదర్శకత





- స్వయం సహాయక సంఘాల నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట
- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /దేవీపట్నం, పెన్ పవర్, జూన్ 5:** స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాల్లో పూర్తి పారదర్శకత తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. శుక్రవారం దేవీపట్నం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కారం పోశమ్మ అధ్యక్షతన నిర్వహించిన 'మన డబ్బు--మన లెక్కలు' యాప్ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ పొదుపులు, రుణాలు, చెల్లింపులు, వడ్డీ వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గతంలో కొంతమంది నిరక్షరాస్య మహిళలను తప్పుదోవ పట్టించి ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు.'మన డబ్బు--మన లెక్కలు' యాప్ ద్వారా సభ్యులు తమ మొబైల్ ఫోన్‌లోనే పొదుపు వివరాలు, తీసుకున్న రుణాలు, చెల్లించిన మొత్తాలు, బకాయిలు, వడ్డీ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. బ్యాంకుల చుట్టూ తిరగకుండానే అవసరమైన సమాచారాన్ని నేరుగా యాప్ ద్వారా పొందే అవకాశం కల్పించబడిందని తెలిపారు.డిజిటలైజేషన్‌లో భాగంగా స్వయం సహాయక సంఘాల ఆర్థిక వ్యవహారాలను మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా నిధుల దుర్వినియోగం, అవకతవకలు, సభ్యులకు తెలియకుండా వారి పేర్లపై రుణాలు పొందడం వంటి చర్యలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. ప్రతి సభ్యురాలు యాప్ వినియోగంపై అవగాహన పెంపొందించుకుని ఆర్థిక లావాదేవీలను స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల చంటిబాబు, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్, సీతపల్లి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు సిద్ధా వెంకన్నదొర, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అడబాల బాపిరాజు, ఏపీఎం నీలి సూరిబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కారం పోశమ్మ, కార్యదర్శి మడకం సంకురమ్మ, కోశాధికారి పాములేటి దేవీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ అభయ కనక దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 5 :**స్తానిక నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో వేంచేసిన శ్రీశ్రీశ్రీ అభయ కనకదుర్గాదేవి ఆలయ తొలి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాహుల్ మీనా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు నగర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని కాంక్షించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజవల్లి, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఆర్ఐ కె.ఎ.పి.మూర్తి, సీనియర్ అసిస్టెంట్ పి.రవికుమార్, డి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయ సాగుకు రైతులు ముందుకు రావాలి





- 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ
- రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- కలెక్టర్ దినేష్ కుమార్

**రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** పోలవరం జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం రంపచోడవరం మండలం తామరపల్లి గ్రామంలోని ఆర్‌అండ్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో రైతులకు 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 20 మంది గిరిజన రైతులకు రూ.34 వేల విలువైన పచ్చిరొట్ట విత్తనాలను 90 శాతం రాయితీపై పంపిణీ చేసినట్లు వెల్లడించారు.రైతులు రసాయన ఎరువులపై ఆధారపడకుండా సేంద్రియ, ప్రకృతి పద్ధతుల వైపు మళ్లాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వర్షాలు కురిసే ముందే పచ్చిరొట్ట విత్తనాలను చల్లి భూసారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, భూమిని తల్లిలా భావించి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందన్నారు.జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని అన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా భూమి సారవంతం అవుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఇతర సౌకర్యాలను రాయితీపై అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపై రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు ఈతలపాడు ప్రధాన రహదారి నుంచి తామరపల్లి గ్రామం వరకు రోడ్డు దెబ్బతిన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి రోడ్డు మరమ్మతుల కోసం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రామమోహనరావు, ఏడీఏ శశిబిందు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు షేక్ మహ్మద్ షరీఫ్, ఉపాధి హామీ పథకం ఏపీవో బి. సత్యనారాయణ, తహసీల్దార్ సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, ఏపీడీ టి. శ్రీనివాస్ విశ్వనాథ్, వైస్ ఎంపీపీ బాలకృష్ణ, ఎంపీటీసీ కుంజం వంశీ, మండల వ్యవసాయ అధికారి కె. లక్ష్మణ్, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు భద్రం, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రి, ఏపీ గురుకుల పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం...





**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 05:** శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ గురుకుల పాఠశాలలో అడ్డతీగల ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో చెట్లను నాటారు. పర్యావరణాన్ని పరిరక్షింప చేయాలి అన్న సంకల్పంతో చెట్లను నాటుదాం, ప్రకృతిని కాపాడుదాం అన్న నినాదంతో గురుకుల విద్యాలయం ప్రాంగణంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఎంపీడీవో కుమార్ తెలిపారు. అలానే అడ్డతీగల స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల బృందం మరియు స్థానిక అటవీ శాఖ సంయుక్తంగా తలపెట్టిన ,ఈ హరిత కార్యక్రమానికి ఆసుపత్రి ఆవరణం వేదికైంది. ప్రకృతిని కాపాడుకోవడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందనే సందేశంతో, ఉభయ శాఖల అధికారులు, సిబ్బంది ఈ ఉమ్మడి కార్యాచరణలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ మహేష్ రెడ్డి, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి. యోగేంద్ర హాజరై, ఆసుపత్రి పరిసరాల్లో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారి పర్యవేక్షణలో ఆసుపత్రి వైద్య సిబ్బంది మరియు అడ్డతీగల అటవీ శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని, వైద్యశాల ఖాళీ స్థలాలలో నీడను, ఆహ్లాదాన్ని ఇచ్చే వివిధ రకాలైన ఔషధ మరియు పూల మొక్కలను నాటారు. పచ్చని వాతావరణం రోగుల మానసిక ఉల్లాసానికి, త్వరగా కోలుకోవడానికి కూడా ఎంతో దోహదం చేస్తుందని ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ యోగేంద్ర మాట్లాడుతూ,కేవలం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పర్యావరణ పరిరక్షణను ఒక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నుంచి భూమిని రక్షించుకోవడానికి విస్తృతంగా అడవులను పెంచాల్సిన అవసరం ఉందని డి ఆర్ ఓ అన్నారు. నాటిన ప్రతి ఒక్క మొక్కను కేవలం వదిలేయకుండా, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించి వృక్షాలుగా మార్చే బాధ్యతను కూడా సిబ్బంది తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ స్టాఫ్, అలాగే అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు , అటవీ శాఖ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# కోళ్ల ఫారం నుండి దుర్వాసన భరించలేకపోతున్నాం





**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూన్ 5;** దపి అంకంపాలెం గ్రామంలో ఉన్న కోళ్ల ఫారం నుండి ఐదు సంవత్సరాలుగా వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామని నిర్వాసిత గ్రామమైన చీడూరు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, రాత్రి వేళలలో కోళ్ళ ఫారం నుండి ఎక్కువగా దుర్వాసన వస్తుందని గిరిజనులు అంటున్నారు. దుర్వాసన పాటు దోమలు కూడా ఎక్కువగా ఇళ్లల్లోకి వస్తున్నాయని తెలిపారు. కొరుటూరు పంచాయతీ ఉప సర్పంచ్ కిచ్చల రామలక్ష్మి చీడూరు నిర్వాసిత గ్రామంలో ఉంటున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలోనే దోమలు దుర్వాసన వస్తుందని అదే వర్షాకాలంలో అయితే మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులకు మా గోడు విన్నవించిన గాని పట్టించుకునే నాధుడే లేరని చీడూరు గిరిజనులు వేడుకుంటున్నారు. పి అంకంపాలెం గ్రామంలోనే ఉన్న కోళ్లు ఫారం నుండి దుర్వాసన రాకుండా దాని నుండి వ్యర్ధపనీరు బయటకు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని చీడూరు గ్రామస్తులైన సంకూరు ప్రసాద్ రెడ్డి, సంకురు పోసిరెడ్డి, శంకరు లచ్చిరెడ్డి ,శంకరు కృష్ణారెడ్డి ఉన్నారు.

# బోలెరో వాహనం బోల్తా 20 మందికి తీవ్ర గాయాలు



**చింతూరు, పెన్ పవర్, జూన్ 5:**మారేడుమిల్లి, చింతూరు ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బోలెరో వాహనం బోల్తా పడడంతో సుమారు 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు, జి. మేడపాడు, గంటి పెద్దాపురం, జగంపేట ప్రాంతాలకు చెందిన సుమారు 30 మంది వివాహ కార్యక్రమానికి హాజరై చింతూరు వైపు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణిస్తున్న బోలెరో వాహనం అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

* ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 5 :**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యా సంచాలకుల ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ , అదనపు వైద్య విద్యా సంచాలకులు డా. ఎం.ఎస్. రాజు అధ్యక్షతన, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. వి.వి. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులతో గోడపత్రిక రూపకల్పన, పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ పర్యావరణం మానవ జీవనానికి, మనుగడకు కీలకమని, పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాక ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. నేటి వైద్య విద్యార్థులు రేపటి సమాజ ఆరోగ్య సంరక్షకులని, ఆరోగ్యవంత సమాజ నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు నాడు ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటి విద్యార్థులు, సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. కె. శివప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని, మొక్కలే జీవనాధారమని, ప్రతి ఒక్కరూ విస్తృతంగా మొక్కలు నాటాలని కోరారు.కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. వి.వి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మానవ , జంతు, పర్యావరణ ఆరోగ్య లు పరస్పర అనుసంధానమై "వన్ హెల్త్ అప్రోచ్" భావనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో, పరిశుభ్రంగా ఉంచేందుకు కలిసి పనిచేయాలన్నారు.కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డా. బి. శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో సరైన విధానాలు పాటించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, పర్యావరణ ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగ ఫ్యాకల్టీ సభ్యులు, ఎల్ఎస్ఎస్‌లు, హెచ్ఈలు, ఎంపీహెచ్ఏలు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత పర్యావరణ పరిరక్షణకు ప్రజల బాధ్యత కీలకం

* ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో కలెక్టర్ కీర్తి చేకూరి, కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 5:**ప్లాస్టిక్ రహిత పర్యావరణ పరిరక్షణకు ప్రజల బాధ్యత కీలకమని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని ఆవ వాంబే కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, ఆర్ ఎమ్ సి అధికారులు, వాంబే కాలనీ వాసులు, చిన్నారులతో కలిసి మొక్కలు నాటడం విశేషం.

ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటోందని, భవిష్యత్ తరాలకు పరిశుభ్ర పర్యావరణాన్ని అందించాడానికి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు మొక్కల పెంపకాన్ని ప్రజలు బాధ్యతగా స్వీకరించాలన్నారు. పచ్చదనం పెంపొందితేనే కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రతి పౌరుడు భాగస్వామి కావాలన్నారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ నగర ప్రజలకు పరిశుభ్ర, ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించేందుకు నగరపాలక సంస్థ పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. నా ఘాట్ నా బాధ్యత కార్యక్రమానికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థల నుంచి విశేష స్పందన లభించడం సంతోషకరమన్నారు. ప్లాస్టిక్ నిషేధం విజయవంతానికి ప్రజలు చిత్తశుద్ధితో సహకరించాలని, పర్యావరణహితాన్ని కాపాడం సాధ్యమవుతుందన్నారు.

అనంతరం స్వచ్ఛ హరితాంధ్ర లక్ష్య సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వి. వినూత్న, ఏడిహెచ్ అనిత, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పుష్కర్ ఘాట్ జంక్షన్‌లో పర్యావరణ మానవహారం

### పాల్గొన్న అధికారులు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' సంయుక్త కార్యాచరణలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పుష్కర్ ఘాట్ జంక్షన్‌లో నిర్వహించిన పర్యావరణ అవగాహన లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ స్టాళ్లను పరిశీలించి, అనంతరం మానవహారంలో భాగస్వామ్యం అయి స్ఫూర్తి నింపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ మార్పు ప్రతి ఒక్కరి నుంచి ప్రారంభం కావాలన్నారు. పిల్లలకు క్లాత్ బ్యాగులు, పర్యావరణ హిత వాటర్ బాటిళ్ల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. రానున్న పుష్కరాల నాటికి తూర్పు గోదావరి జిల్లాలో కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, నదీ జలాలకు, డ్రైనేజీ వ్యవస్థకు కలుగుతున్న నష్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఇకపై అధికారులు హాజరయ్యే సమావేశాలకు ప్లాస్టిక్ బాటిల్స్ ఇవ్వరాదని, గాజు సీసాలు లేదా స్టీల్ గ్లాస్ లలో త్రాగునీటినీ ఇవ్వాలని స్పష్టం చేశారు. అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నా ఘాట్ -- మై బాధ్యత' కార్యక్రమం ద్వారా నగరం లోనీ14 ఘాట్‌ల రూపురేఖలు మారనున్నాయన్నారు. ప్రతి నెల ఘాట్‌ల పరిశుభ్రత ఆధారంగా ర్యాంకింగ్‌లు ప్రకటించడం ద్వారా పోటీతత్వం పెరిగి మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను అవలంబించాలని పిలుపునిచ్చారు.నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ నా గోదావరి -- నా గొప్ప' కార్యక్రమంలో భాగంగా గోదావరి ఘాట్‌ల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రానున్న పుష్కరాల నాటికి ఘాట్‌లను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ , విద్యా సంస్థల భాగస్వామ్యంతో కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రమైన, కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

"కలిసికట్టుగా నడుద్దాం -- గోదావరిని కాపాడుకుందాం" అనే నినాదాలతో మానవహారం నిర్వహించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల పరిరక్షణలో భాగస్వాముల మవుతామని, ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధిస్తామని, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ రీటా, ఎంహెచ్‌వో ఎ. వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# గిరిజన విద్యార్థుల ప్రతిభకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

### పోలవరం జిల్లా ముగ్గురు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

### విద్యార్థులను అభినందించిన కలెక్టర్ దినేష్ కుమార్







**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసివస్తే విద్యార్థులు అసాధారణ విజయాలు సాధించగలరని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన గిరిజన విద్యార్థులను ఆయన అభినందించారు.

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా పోలవరం జిల్లాకు చెందిన ముగ్గురు ప్రతిభావంతులైన విద్యార్థులు అవార్డులు అందుకోవడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు.గిరిజన సంక్షేమ శాఖ పోస్టు మెట్రిక్ హాస్టళ్ల విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచిన చింతూరు పోస్టు మెట్రిక్ బాలికల హాస్టల్ విద్యార్థిని కుమారి కుంజా కళ్యాణి బైపీసీ గ్రూపులో 962 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. అలాగే మారేడుమిల్లి పోస్టు మెట్రిక్ బాలికల హాస్టల్ విద్యార్థిని కుమారి సాదల నందిని హెచ్ఈసీ గ్రూపులో 903 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు పొందారు.పదో తరగతి ఫలితాల్లో పనసలపాలెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి చలుమర్తి జగన్మోహన్ రెడ్డి 567 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విజయాలు గిరిజన విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ విజయాల వెనుక విద్యార్థుల కఠోర శ్రమతో పాటు ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, హాస్టల్ సిబ్బంది అందించిన ప్రోత్సాహం కీలక పాత్ర పోషించాయని కలెక్టర్ అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్య, ఉద్యోగ, సేవా రంగాల్లో రాణించి జిల్లా, రాష్ట్రాలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎం. రుక్మందయ్య కూడా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తూ, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది -బడేటి చంటి



**ఏలూరు జూన్ 5 పెన్ పవర్ :** రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అహర్నిశలు పాటుపడుతోందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రతి శుక్రవారం జరిగే ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉన్న ఆయన,తనను కలిసేందుకు విచ్చేసిన వారిని ఆప్యాయంగా పలకరించారు. వారి నుండి వినతులు స్వీకరించారు.సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించి, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ

రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ జనహితమే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. ఇదేసమయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని వెల్లడించారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట





**గంగవరం, పెన్ పవర్, జూన్ 5:**మన డబ్బు మన లెక్కలు యాప్ తో స్వయం సహాయక సంఘాల నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసినట్లేనని ఎంపీడీవో లక్ష్మణరావు ఉన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గంగవరంలో వెలుగు ఏపీఎం అప్పలకొండ ఆధ్వర్యంలో మన డబ్బు మన లెక్కలు యాప్ అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కృష్ణారెడ్డి జడ్పిటిసి బేబీ రత్నం వైస్ ఎంపీపీ గంగాదేవి కూటమి నాయకులు మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ మాజీ సర్పంచ్ కలుముల అక్కమ్మ ముఖ్య అతిథులుగా హాజరై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా సంఘం సభ్యులు తమ పొదుపు రుణాలు చెల్లింపు వడ్డీ వివరాలు ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు అన్నారు.డిజిటలేషన్లో భాగంగా స్వయం సహాయక సంఘాల ఆర్థిక వ్యవహారాలను మరింత సులభతరం చేయడం జరిగిందన్నారు. తద్వారా నిధుల దుర్వినియోగం అవకతవకల కు అడ్డుగడ్డపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, గ్రామ సమాఖ్య లీడర్లు ,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# శశి ఇంజనీరింగ్ కాలేజీలో ఏటీసీ-11, ఐజీసీ ఎంపిక శిబిరం ప్రారంభం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 05:**స్థానిక శశి ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్‌సీసీ ఏటీసీ-మరియు ఐజీసీ సెలక్షన్ క్యాంప్ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని కమాండింగ్ ఆఫీసర్ అమిత్ పాండే నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.

ఈ శిక్షణా శిబిరంలో క్యాడెట్లకు టెంట్ పిచ్చింగ్, వెపన్ ట్రెయినింగ్ (.22 ఫైరింగ్), అబ్స్టాకిల్స్ (అడ్డంకులను అధిగమించడం), మ్యాప్ రీడింగ్, జేడీఎఫ్ఎస్, హెల్త్ అండ్ హైజీన్ (ఆరోగ్యం-పరిశుభ్రత) మరియు డ్రోన్ ట్రైనింగ్‌లపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ కొండయ్య మరియు కమాండింగ్ ఆఫీసర్ అమిత్ పాండే మాట్లాడుతూ ఈ శిబిరంలో క్యాడెట్లకు అన్ని విభాగాలలో అత్యుత్తమ శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించే పోటీలలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ క్యాడెట్లను ఎంపిక చేసి, తదుపరి స్థాయి పోటీల కోసం విజయవాడకు పంపించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే మాట్లాడుతూ, శిబిరం నిర్వహణకు అవసరమైన వేదికతో పాటు అన్ని సౌకర్యాలను కల్పించిన శశి ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం మరియు ప్రిన్సిపాల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్యాడెట్ల శిక్షణకు అనుకూలమైన వాతావరణం కల్పించడంలో కళాశాల యాజమాన్యం అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

# "తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ పర్యావరణ పరిరక్షణ పిలుపు!"

* "వృక్షో రక్షతి రక్షితః -- పచ్చదనాన్ని పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం!"






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 05:**స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్ ప్రాంగణం తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ట్రెజరర్ లయన్ బడుగు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో వరల్డ్ ఎన్వరాల్ మెంట్ డే కార్యక్రమం జరిపారు లయన్స్ 316 జి..జిల్లా ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు సౌజన్యం తో పలు ప్రాంతాల లో మొక్కలు నాటి నీరు పోసి శుభ్రం చేశారు లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ జిల్లా గవర్నర్ ఎన్ వి.వి యస్ పాపా రావు నాయుడు పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం చేయడం. స్ఫూర్తి దాయకం అని అంతర్జాతీయ లయన్స్ క్లబ్ గ్లోబల్ కాజెస్ లో ఎన్వరాల్ మెంట్ కూడా ఓ భాగం అని ఈరోజు మనం నాటే మొక్కే, రేపటి తరానికి ప్రాణవాయువు. పర్యావరణాన్ని రక్షించడం మన అందరి బాధ్యత. పర్యావరణ పరిరక్షణలో మనమూ భాగస్వాములం అవుదాం."
అన్నారు లయన్ బడుగు చంద్ర శేఖర్ మాట్లాడుతూ
వృక్షో రక్షతి రక్షితః -- వృక్షాలను మనం కాపాడితే, అవి మనల్ని కాపాడతాయి. ప్లాస్టిక్‌ను విడనాడదాం -- పర్యావరణాన్ని కాపాడుకుందాం.
మొక్కలు నాటడం ఒక నినాదం కాదు.అది మన జీవన విధానం కావాలి. డైమండ్స్ లయన్స్ క్లబ్ తరుపున యోగా సభ్యులు తో క్రమం తప్పకుండా ఈ కార్యక్రమం చేపట్టాం అన్నారు ఈ కార్యక్రమం లో గణపతి రాజు,రాగినీడి వర ప్రసాద్ పట్నాల రామకృష్ణ యోగా సభ్యులు లయన్స్ తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ కార్మికుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ నిరసన

* అప్కోస్ కార్మికులను రెగ్యులర్ చేయాలి
* ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 5:** అప్కోస్ లో 2022 సంవత్సరం నుండి ఇప్పటివరకు మున్సిప ల్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు 21 వేలు జీతం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తాటిపాక మధు కోరారు. 21 వేలు జీతం తీసుకుంటూ మరణించిన వారి కుటుంభికులకు ఇప్పుడు మున్సిపల్ ప్రవేటు ఏజిన్సీ 15 వేలు జీతం ఇవ్వడానికి సిద్ధపడుతున్నారని జిల్లా కలెక్టర్ ఆ చర్యను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు
శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు మున్సిపల్ సమస్యలను వారికి వివరించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ సుప్రీం కోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతుంటే కొంతమంది అధికారులు 8 గంటల పాటు కార్మికులతో పనిచేయించుకుని తక్కువ జీతాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారన్నారు, కార్మిక చట్ట ప్రకారం కనీసం రోజుకు కార్మికుడికి రూ. 700 లు చొప్పున వేతనం చెల్లించాలని, కార్మికుడకు నెలకు రూ 21 వేలు జీతం ఇవ్వాలని మధు డిమాండ్ చేశారు. రిటర్మెంట్ వారి కుటుంబీకులకు ఇప్పటికీ ఉద్యగాలు ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు
గోదావరి పుష్కరాల సందర్భంగాస్పెషల్ శానిటేషన్ కార్మికుల కోసం మా సొసైటీ కే చెందిన టెండర్లు ఇవ్వాలని ప్రభుత్వన్ని కోరుతున్నామన్నారు
ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు
ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనాల దుర్గమ్మ, రాష్ట్ర కార్యదర్శి అల్లం వెంకటేశ్వర రావు జిల్లా అధికారబడి బంగారు గిరి, గుడుపు గిరి, సిటీ ప్రధాన కార్యదర్శి కాకి శారద, ఉపాధ్యక్షులు పి పోలమ్మ, సిటీ జాయింట్ సెక్రటరీ రమణ, ఉపాధ్యక్షులు దేవి కోశాధికారి సరస్వతి, సిటీ కార్యవర్గ సభ్యులు సైదులు, లోకేశ్వరిజ్యోతి, వెంకట లక్ష్మి క్లస్టర్ కు ముగ్గురు చొప్పున పాల్గొన్నారు

# డా. వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఘనంగా రైతు సదస్సు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 05**:సుస్థిర ఉద్యానం – సుభిక్ష ఫలసాయం ప్రధానాంశంగా ఉద్యాన పంటలలో ఆధునిక సాగు పద్ధతుల పరిచయం, సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన కల్పించడం తో బాటు, రైతుల సందేహాలకు సమాధానం ఇవ్వాలని లక్ష్యంతో శుక్రవారం వెంకట్రామన్నగూడెం లోని డా. వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన "రైతు సదస్సు" ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ , అతిధులుగా పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ శ్రీమతి గంటా పద్మశ్రీ , నీటి వినియోగదారుల సంఘాల సదస్సు అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ శ్రీమతి సిహెచ్ మంగబాయి , రాష్ట్ర టైలర్స్ బోర్డు చైర్మన్ ఆకాశపు స్వామి, గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వై బ్రహ్మ రాజు, ప్రత్యేక అతిధులుగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి వి సత్యనారాయణ, వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ జె.వి.రమణ , భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఐ సి ఏ ఆర్ హైదరాబాద్ జూన్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా పాల్గొన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు మాట్లాడుతూ, గత కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉద్యాన రంగంలో అద్భుతమైన వృద్ధిని సాధిస్తూ రాష్ట్ర ఆర్థిక ఎదుగుదలకు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది ఈ క్రమంలో 2007 సంవత్సరంలో స్థాపించబడిన డా.వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన విద్యా బోధన, పరిశోధన రంగాల్లో విశేషమైన సేవలందిస్తూ విస్తరణ కార్యక్రమాల ద్వారా రైతులకు చేరువైంది. 38 రకాల నూతన వంగడాలను ఈ విశ్వవిద్యాలయం విడుదల చేయటం ఉద్యాన పరిశోధన రంగంలో ఒక మైలురాయి. సుస్థిర ఉద్యానం సుభిక్ష ఫల సాయం అనే ప్రదానాంశంతో ఏర్పాటు చేసిన రైతు సదస్సు ద్వారా రైతులకు కృత్రిమ మేధస్సు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డ్రోన్ టెక్నాలజీ మరియు ఆటోమేషన్ లపై అవగాహన పెంచడం ద్వారా పెట్టుబడి వేయడం తగ్గి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు తెలియజేయడమే మా ఉద్దేశం.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఉద్యాన రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుండటం ఉద్యాన రైతులకు మరియు ఉద్యాన విద్యార్థులకు శుభ పరిణామం. ఈ క్రమంలో ఉద్యానవసవిద్యాలయం విద్యా బోధనతో పాటు విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో కోర్సులు నిర్వహిస్తోంది. దాదాపు 100కు పైగా జాతీయ అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు పరిశోధకులకు తద్వారా రైతులకు తోడ్పాటున అందించే ప్రయత్నం చేస్తున్నాం. ముఖ్యఅతిథి ప్రభుత్వం మరియు తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతుల పట్ల రైతులకు దక్కాల్సిన గిట్టుబాటు ధరల పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపారమైన చిత్తశుద్ధి ఉంది. రైతుల ప్రయోజనాలను కాపాడడం కోసం చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముందుంటారు. ఈరోజు ఉద్యాన పంటలకు ఉద్యాన రంగానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ రైతుల కొరకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. గత ఐదు సంవత్సరాల్లో 2019- 24 మధ్య ఎన్నడు రైతుల కొరకు ఇంత భారీ రైతు సదస్సు జరగలేదు. ఇప్పటి వైస్ ఛాన్సర్ ధనుంజయ రావు కృషిచేసి యూనివర్సిటీ అంతటినీ రైతుల ప్రయోజనాల కోసం పని చేయిస్తున్నారు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఇక్కడ ఉన్న అన్ని సదుపాయాలను చూసి శాస్త్రవేత్తలతో మాట్లాడి వెళ్లాలని కోరుతున్నాను, రాబోయే రోజుల్లో ఉద్యాన పంటల ద్వారానే అధిక ఆదాయం వస్తుంది, అని బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తొలుత నాబార్డ్ నిధులతో నూతనంగా నిర్మించిన విశ్వవిద్యాలయ పరిపాలన కార్యాలయ అదనపు భవనాలను మరియు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వారి ఆర్థిక సహకారంతో నిర్మించిన బాలికల వసతిగృహం అనుబంధ భవనాన్ని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. సదస్సు అనంతరం రాజ్యసభ సభ్యులు శ్రీ పాక వెంకట సత్యనారాయణ ఉద్యాన విశ్వవిద్యాలయం సందర్శించి, అక్కడ ఏర్పరిచిన సదుపాయాలన్నిటిని పరిశీలించి అభినందనలు తెలియజేశారు.
సదస్సు లో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సీనియర్ శాస్త్రవేత్తలు హాజరై రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో ఎల్ ని నో పరిస్థితుల్లో ఉద్యాన పంటల యాజమాన్యం, డ్రోన్ టెక్నాలజీ, వివిధ ఉద్యాన పంటలు విలువదారిక ఉత్పత్తులు మొదలగు 18 అంశాలపై , ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రూపొందించిన వివిధ ప్రచురణలను శాసనసభ్యులు ఆవిష్కరించారు. అంతేకాక ఎంటమాలజీ ప్రొఫెసర్ డా ఈ ఇమ్మానియేల్ మార్గదర్శికత్వంలో ఉద్యాన విద్యార్థులు రూపొందించిన తేనె పట్టు ఆధారిత ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఈ ఉత్పత్తులకు భారత ప్రభుత్వం ప్రాథమికంగా పేటెంట్ మంజూరు చేయడం విశేషం.ఈ కార్యక్రమానికి దాదాపు 4 వేల మంది రైతులు, మహిళలు తరలి రావడం విశేషం. ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 70 స్టాల్స్ లో వివిధ నూతన సాంకేతిక పరికరాల ప్రదర్శన రైతుల్ని ఎంతో ఆకట్టుకుంది.యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డా.సీఎహ్.రూత్ వందన సమర్పణ చేశారు.



# వెన్నుపోటుకు రెండేళ్ల భాగంగా టీడీపీ మేనిఫెస్టో ప్రతులను దహనం









**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 05:**సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామిలిచ్చిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు విమర్శించారు. వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమంలో భాగంగా గురువారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో టీడీపీ మేనిఫెస్టో ప్రతులను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏం మాట్లాడాలో తెలియని పరిస్థితిలో ఉన్నాడన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు 143 రకాల హామీలు ఇచ్చారన్నారు. సూపర్ సిక్స్‌లో అమలవుతున్న ఒకటి, రెండు పథకాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆరోపించారు. మహిళలకు ఫ్రీబస్సు ఏర్పాటు చేసి అదనపు సర్వీసులు ఏర్పాటు చేయక పోవడంతో రద్దీ కారణంగా చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులను పూర్తిగా దగా చేశారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలోగా వైఎస్సార్‌సీపీని మరింతగా బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# కోర్టు భవనముల సముదాయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 05 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తణుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్ మరియు 4వ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె. మాధవి , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. బాబు కోర్టు భవనముల సముదాయంలో సపోటా, ఉసిరి, కదంబం మొదలగు మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. అప్పిరెడ్డి , సెక్రటరీ కె. శ్రీనివాసరావు , ఎస్వీ రామికృష్ణ , ఏపీ పి కె. శివరామకృష్ణ, ఏజి పీ ఈ మోషే, కె.కె వి మహాలక్ష్మి, బార్ మెంబర్స్, అడ్వకేట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో పర్యావరణ రక్షణగా, కాలుష్యం నివారించడానికి ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని, భావి తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని జడ్జి కె. మాధవి సూచించారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ అమలు చేయాలి**

**జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 5:** అంతర్జాతీయ యోగా దినోత్సవం–2026 కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పోలవరం జిల్లా యోగాంధ్ర నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఆయుష్ వైద్యులు డా. మనోహర్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 6 నుంచి 21వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా యోగా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు, పౌరుల నమోదు, థీమాటిక్ యోగా, పర్యాటక ప్రాంతాల్లో యోగా, దేవాలయ యోగా కార్యక్రమాలు, యోగా పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మాస్టర్ ట్రైనర్లు, యోగా ట్రైనర్లకు శిక్షణలు అందించడంతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా విస్తృత స్థాయిలో పౌరుల నమోదును చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయిల్లో నోడల్ అధికారులను నియమించి అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పిలుపునిచ్చారు.



# పిక్నిక్ పాయింట్‌లో విషాదం

- నీటిలో మునిగి యువ ఫోటోగ్రాఫర్ మృతి





**చింతూరు, పెన్ పవర్, జూన్ 05:** మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ రోజు విషాదకర ఘటన చోటుచేసుకుంది. మోతుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో దారాలమ్మ తల్లి గుడి సమీపంలోని పిక్నిక్ పాయింట్ వద్ద నీటిలో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తాడికలపూడి గ్రామానికి చెందిన పది మంది యువకులు విహార యాత్ర కోసం మరేడుమిల్లి, మోతుగూడెం జలపాతాలను సందర్శించేందుకు వచ్చారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో దారాలమ్మ తల్లి గుడి సమీపంలోని పిక్నిక్ పాయింట్ వద్దకు చేరుకుని నీటిలో స్నానం చేస్తుండగా, వారిలో ఒకరైన పూసా అఖిల్ (24), వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్, ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సహచరులు గమనించి వెంటనే సహాయక చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మోతుగూడెం సబ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ నస్సిర్ హుసైన్ తెలిపారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

# నేడు సాకారమవుతున్న పేదల ఇంటి కల

- పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత
- టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము
- గౌరిదేవిపేటలో హౌసింగ్ గ్రామసభ ఏర్పాట





**ఎటపాక, పెన్ పవర్ :** పేదల ఇంటి కల నేడు కూటమి ప్రభుత్వంలో సాకారమవుతుందని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గౌరిదేవిపేట గ్రామపంచాయతీలో శుక్రవారం నాడు సచివాలయం కార్యదర్శి శ్రీలక్ష్మి అధ్యక్షతన హౌసింగ్ లబ్ధిదారులతో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము హాజరై మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణాన్ని సమతుల్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కూటమి ప్రభుత్వం గౌరిదేవిపేట పంచాయతీ పరిధిలో ఇల్లు లేని నిరుపేద , మధ్యతరగతి కుటుంబాలకు చెంది , అర్హులైన 40 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ముక్కెర భద్రరావు , మల్లెల లక్ష్మణరావు , బొమ్మగాని శ్రీనివాసరావు , అంగన్వాడీ కార్యకర్తలు , గ్రామస్తులు , డ్వాక్రా మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**చింతూరులో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు**



**చింతూరు, పెన్ పవర్, జూన్ 5:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహించిన అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా బీజేపీ చింతూరు మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మయ్య రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బట్ట లక్ష్మయ్య రాజు మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వంటి సమస్యలు ప్రస్తుతం ప్రపంచానికి సవాలుగా మారాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. నాటిన మొక్కలు పూర్తిగా పెరిగే వరకు వాటి సంరక్షణ కోసం ట్రీ గార్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి కొమ్మెజు ఈశ్వరరావు, కోశాల సత్తిబాబు, నామాల శ్రీనివాసరావు, కొప్పు సామి షణ్ముఖం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అనంత అరణ్య మోడల్ లో మొక్కల పెంపకం





**వై రామవరం, పెన్ పవర్, జూన్ 5 :** అనంత అరణ్యం మోడల్ లో మొక్కలు పెంపకం నకు పి . ఎర్రగొండలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూల్ ఎంపికైందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

నెట్ జీరో ఆరోగ్యకరమైన క్యాంపస్ గా తీర్చిదిద్దుటకు వై. రామవరం మండలం పి.ఎర్రగొండ గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూల్ ఎంపికైందని ఎంపీడీవో కే. బాపన్న దొర తెలిపారు. అత్యధిక సాంద్రత కలిగిన మొక్కలను పెంపకం అనంత అరణ్య మోడల్ లో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఏకలవ్య స్కూల్ కాంపౌండ్ వాల్ వెంబడి 1625 మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఈ మొక్కలకు మూడు సంవత్సరాల పాటు సంరక్షణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ స్కూలు ఆవరణలో మొక్కల పెంపకంతో పాటు సొంతంగా విద్యుత్ ఏర్పాటు స్వచ్ఛమైన మంచినీరు స్వచ్ఛమైన గాలి ఆవరణ మొదలు అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ఏకలవ్య మోడల్ స్కూల్ నందు మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆనందరావు వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ,ఎంపీటీసీ కే సుబ్బలక్ష్మి, పి ఎర్రగొండ మాజీ సర్పంచ్ పి రాజేశ్వరి, పిసా సెక్రటరీ పి తమ్మిరెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బూరరామ్ బైరవ, ఏపీవో సాయిబాబా గ్రామ సచివాలయం సిబ్బంది ఉపాధి సిబ్బంది ఇతర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యదేవుని దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ అభిషేక్ రెడ్డి



**అన్నవరం పెన్ పవర్ 5 జూన్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దర్శనార్థం పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిషేక్ రెడ్డి శ్రీ స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఏఈఓ శ్రీనివాసరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

# ఎల్ఐసీ దేశంలోనే నంబర్‌వన్ ఆర్థిక సంస్థ






- ప్రతి పౌరుడికి బీమా రక్షణ కల్పించడమే లక్ష్యం
- రాజమండ్రి డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు

**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, జూన్ 5 :** భారతదేశంలో రూ.56 లక్షల కోట్లకు పైగా ఆస్తులు కలిగిన జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) దేశంలోనే నంబర్‌వన్ ఆర్థిక సంస్థగా నిలిచిందని రాజమండ్రి ఎల్ఐసీ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు పేర్కొన్నారు. రాజమండ్రి ఎల్ఐసీ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "హాయ్ హాయిగా... చల్ల చల్లగా మారేడుమిల్లి" కన్వెన్షన్ విజేతల సమావేశం శుక్రవారం మారేడుమిల్లిలో ఘనంగా జరిగింది. గోకవరం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ డీఎస్‌వీ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు, మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ సాహు మాట్లాడుతూ దేశంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్ఐసీ ఆర్థిక చేయూత అందిస్తోందన్నారు. రాజమండ్రి డివిజన్ దేశవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు సాధించిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో డివిజన్ పరిధిలోని 20 బ్రాంచీలు, 11 శాటిలైట్ బ్రాంచీల ద్వారా రూ.195 కోట్ల సింగిల్ ప్రీమియం వ్యాపారం సాధించినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికి ఎల్ఐసీ సేవలను చేరవేసి, ప్రతి పౌరుడికి బీమా రక్షణ కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో పాలసీల సేకరణలో ప్రతిభ కనబరుస్తున్న ఏజెంట్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతమైన మారేడుమిల్లిలో కన్వెన్షన్‌ను విజయవంతంగా నిర్వహించిన గోకవరం బ్రాంచ్ బృందాన్ని ఆయన అభినందించారు.

మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధికి ఏజెంట్లు మరింత కృషి చేయాలని సూచించారు. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని 31 బ్రాంచీలకు చెందిన సుమారు 1,200 మంది ఏజెంట్లు పాల్గొనడం విశేషమన్నారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 150 మంది ఏజెంట్లు, నిర్వహణ కమిటీ సభ్యులను సీనియర్ డివిజనల్ మేనేజర్ ఘనంగా సన్మానించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలతో అతిథులకు స్వాగతం పలికారు. ఆదిత్య ఈవెంట్స్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శర్మ, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ విజయ కోటేశ్వరరావు, ఉద్యోగుల సంఘ నాయకులు, ఏజెంట్ల సంఘ ప్రతినిధులు, బ్రాంచ్ మేనేజర్లు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.